# "రిచ.ఇ.త్"

రా.వి. శాస్త్రి.



అతని అసలు పేరు ఇంబతూర్ తమ్మయ్య. అతను ఎప్పటికప్పుడు కథలు రాయగలడు! ఇప్పటికిప్పుడు రాయగలడు. అందుచేత అతని స్నేహితులు అతణ్ని 'ఇప్పటికిప్పుడు కథకుడు' అని పిలుస్తుండేవారు. అలా పిలవగా, పిలవగా ఆఖరికతను ఇప్పటి తమ్మయ్యగా మిగిలిపోయేడు. ఆ పేరున తను టూకీగా "ఇ.త."గా మారిస్తే, దాన్ని కొంతమంది స్నేహితులు "ఇత్తగాడు" కింద మార్చేరు అయితే, "ఇ.త."గా అతను ఆంధ్ర పాఠక లోకానికి సుపరిచితుడు! అందులో చాలామందికి అతను అతి ప్రియుడు, చదువుకున్నవారు పదిమంది చేరిన చోటుకి ఓ రాయి విసిరితే అతి ఇ.త. గారి ఇష్టుల్లో ఒక్కడికైనా తగిలి తీరుతుంది. పదిరాళ్ళు విసిరితే పదిమందికైనా తగలవచ్చు. నిజం చెప్పాలంటే అతనికి, ఇంట్లో కూర్చొని వీధిలోకి రాళ్ళు రువ్వినట్టు, పాఠకుల మీదికి కథలు విసరడం అంటే చాలా సరదా. ఫలానావాళ్ళకి తగలాలీ అని అతను గురిచూసి కొడుతుంటాడు కూడాను. ఇంకా నిజం చెప్పాలంటే అతనికి రాళ్ళు రువ్వడంతోనే కథలు రాయడం కూడా ఎక్కువ అలవాటయింది.

ఇ.త.కి పదిహేనోయేడు వెళ్ళి పదహారో ఏడు వచ్చినప్పుడు వాళ్ళ పక్కింటి అమ్మాయికి పద్నాలుగోయేడు వెళ్ళి పదిహేనోయేడు వచ్చింది. ఇ.త. అప్పటికప్పుడే మనోరమ, మనోహరి, మైదానం, మగువ తెగువ వగైరా పుస్తకాలు కంఠస్థం చేసి ఉన్నాడేమో పక్కకి నడివయసు వచ్చినట్టు మాంచి పెంకితనంగా ఉండేవాడు. అతని పక్కింటి అమ్మాయి ఆ పుస్తకాలేమీ చదవలేదు; కాని వంటరిగా డాబా మీద పడుకొని చంద్రుణ్ని, చుక్కల్నీ చూడాలనే ఆకాంక్ష ఆమెలో ఉత్పన్నమయింది. ఆ పిల్ల అలా డాబామీద వంటరిగా ఉండే సమయాల్లోనే ఇ.త.కి కూడా డాబామీద ఎక్కాలనే అభిలాష కలిగేది. కాని, సాయంకాలాల వేళ పక్కింటి పెద్దలు ఓ కంట కనిపెడుతూ వుంటారని ఇ.త. కనుక్కోలేకపోయాడు. ఓనాటి సాయంకాలవు టారుగంటల శీతాకాలవు మసక వెన్నెల్లో పక్కింటి డాబా మీద పడుకున్న ఆడపిల్ల మీదికి "ఇ.త." ఒక రాయి (చాలా చిన్నది, ఎంతో ముద్దుది, "ప్రేమరాయి" అనే పేరు గలది ఓ రాయి) విసిరాడు. రాయి విసిరేక అతను అక్కడ పడుకున్నది ఆడపిల్ల కాదనీ, "ఆడవులి" పేరు గల ఆమె మేనత్త అని తెలుసుకున్నాడు. ఆ మేనత్త వెంటనే అరువులు అరిచి తన తమ్ముణ్ని ఇ.త. మీదికి ఉసిగొల్పింది. తమ్ముడంటే చిన్న బుల్లి తమ్ముడు కాదు. ముప్ఫయ్యేళ్ళవాడే అయినప్పటికీ ముప్పైరెండేళ్ళ అక్కకి అతను తమ్ముడే. అతను వచ్చి ఇ.త.ది. ఇంతే వున్న పిలక పట్టుకొని వీపు చీరేశాడు. దాన్తో పెద్ద అల్లరయిపోయింది. ఇ.త. తల్లి (ఇ.త.కి తండ్రి లేడు,) అందుచేత తల్లే వెళ్ళి పక్కింటివాళ్ళ కాళ్ళు పట్టుకొని, వాళ్ళ కోపం తగ్గించడానికి వాళ్ళ కళ్ళముందే తను కూడా ఇ.త.ని పట్టుకొని ఓ ఉతుకు ఉతికేసింది. ఆ తగువు అంతటితో చల్లారింది. కాని, ఇ.త.గారి మనసులో క్రోధం చల్లారలేదు. చేతనైన వాడి కోపం చేతల్లో వుంటుంది. మరి కొందరి కోపం రాతల్లో ఉంటుంది.

అంతకుముందు అతను చాలా కథలు రాసేడు. కాని అవి పబ్లిష్ కాలేదు. కాని ఈ కథ మాత్రం అతను చాలా జాగ్రత్తగా రాసేడు. చల్లారని వీపు మంటతో చాలా పట్టుదలగా రాశాడు.

ఆ కథలో–

ఒక నవయువకుడు పదహారేళ్ళవాడుంటాడు. అతను గాఢంగా ఓ యువతిని ప్రేమిస్తాడు. ఆమె కూడా ఆ విధంగానే చేస్తుంది. కాని, 'స్వర్గంలో సర్పం, గులాబికి ముళ్ళు. మణికి ఫణీ ఉన్నట్టుగా ఆమెకు ఒక మేనత్త ఉంటుంది, ఆమె బాల విధవ, ఇల్లుబట్టిన విధవాడబడుచూను. ఆమె వీరి ప్రేమకు అడ్డు తగుల్తాంటుంది. ఓనాడు ప్రేమ యువతి కాబోలు తను డాబా మీద పడుకొని వుండగా ఆ ప్రేమ యువకుడు సాంకేతికంగా చిన్న రాయి విసురుతాడు. ఆమె సాంకేతికంగా కుడిచెయ్యి




EYE ADS © 351769



అక్కినేని నాగేశ్వర్రావు
లెక్కలేని ఎత్తుల్లేవు
సాగలేని దూరాల్లేవు
భారాల్లేవు
ఐనా – ఈనాడు
తెలుగుసినిమానావ
నతనుచేర్చుదలచే రేవు
నీటికీ – నేటికీ
నూరామడనిపించే
హైదరాబావు!

ఎత్తి దించుతుంది. అప్పుడు యువకుడు తన డాబామీద నుంచి ఆమె డాబామీదికి లంఘించి ఆమెని చేరేసరికి ఆమె యువతికాదు; విధవాడబడుచు. ప్రేమ యువకుడు ఆశ్చర్యపోయాడు. కాని, ఆవిడ ఆశ్చర్యకరంగా, మౌనంగా, దీనాతిదీనంగా అతని చేయిపట్టుకుని ఏదో అర్థించే సమయానికి ఆవిడ తమ్ముడు వస్తాడు. అతను ప్రళయరుద్రుడవుతాడు. విధవాడబడుచు బిక్కుబిక్కు చూపులు చూస్తుంది. పులికి దొరికిపోయిన హరిణంలా ఉంటుందావిడ. ఆ చూపు చూడగానే ప్రేమయువకుళ్ళో జాలి కెరటాలు లేస్తాయి. ఆ విధవరాలిలోని తీరని కోరికల బాధనతడు అర్థం చేసుకుంటాడు. తన భావాల్ని అర్థం చేసుకోకుండా తన మేనగోడలి యవ్వనాన్ని కామించినందుకు ఆవిడలోని ఉండే అనురాగం ఆ యువకుని ఎడల కోపంగా మారిందేకాని మరొకలా కాదని అతను గ్రహిస్తాడు. అమె నిజభావం క్షణంలో అతనికి అర్థమవుతుంది. పునర్వివాహమే కాని ఆవిడ చేసుకోగలిగినట్లయితే, ఈ సంఘం అవిణ్ణి చేసుకోనిచ్చినట్లయితే ఆవిడకి ఆ దురవస్థ తప్పేది కదా అని అతను లోలోన వాపోతాడు. ఆవిడ పరువు కాపాడ్డానికి తను ఏ త్యాగమైనా చేయాలనుకుంటాడు. ఆవిడ చాలా అందంగా ఉంటుంది. ఆవిడకి తల ఉంటుంది. చేతులకి బంగారవుపి జతగాజులుంటాయి. అప్పుడు ఆ యువకుడు ఆమెచేతిది ఓ గాజులాగి ఆమె తమ్ముడికి వినబడేలాగున "ఏవండీ, ఏవండీ! క్షమించండి, మీ గాజు మీరు తీసుకోండి. మరెప్పుడూ దొంగతనం చెయ్యనండి!' అంటాడు. ఆవిడ 'కృతజ్ఞతాపూర్వక దృష్టుల్తో అతణ్ణి తడిసి ముంచెత్తుతుంది' అప్పుడు 'దొంగవెధవా!' అంటూ ఆవిడ అన్నగారో, తమ్ముడుగారో కాని అతను ఆ యువకుణ్ణి పట్టుకొని "పీవు చీరేస్తాడు" అంతలో అసలైన ప్రేమ యువతి కూడా ఆ అల్లరి విని అక్కడికి వస్తుంది, యువకుడు యువతిని చూడకుండా దృష్టి తప్పించుకుంటాడు. విధవావిడ తన మేనకోడల్ని కౌగలించుకుని వెక్కివెక్కి ఏడుస్తుంది. యువకుణ్ణి ఆవిడ తమ్ముడు చితక్కొట్టి విడిచిపెడతాడు, పోలీసువారికి అప్పజెప్పడు. (ఎందుచేతనంటే; ఇ.త. గారి జీవితంలోకి పోలీసులు అప్పటికి ఇంకా రాలేదు). ఆ రాత్రి దెబ్బలకి మూలుగుతాడే కాని ప్రేమ యువకుడు సంతృప్తిగా నిద్రపోతాడు.

ఆ కథలో ఆ విధంగా జరుగుతుంది.

పదహారోయేట అంత మంచికథ రాయగలిగినందుకు కథక కిశోరాలన్నీ ఇ.త.ని ఆకాశానికి ఎత్తేసేయి. 'స్వర్గంలో సర్పం', 'గులాబీకి ముల్లు' అని ఎవరైనా అనగలరు, కాని 'మణికి ఫణి' అనడం చాలా కష్టం అన్నాయి కిశోరాలన్నీ కూడా. 'అంతేకాదు అంత చిన్న వయసులో. స్త్రీ బాధనీ, స్త్రీ హృదయాన్నీ అర్థం చేసుకొని అంత చక్కగా రాయగలగాలంటే దాని వెనుక ఎంతో స్వానుభవం ఉండి ఉండాలనికూడా కథక కిశోరాలన్నాయి. ఆ పొగడ్తకి యువక ఇ.త. ఎంతో ముద్దుగా సిగ్గుపడ్డాడు.

అదీ సంగతి! ఆ కథతో ఇంబళ్ళూర్ తమ్మయ్య పెద్ద కథకుడయేడు. అతనికి చక్కని కీర్తి, పత్రికనించి వంద రూపాయల చెక్కూ వచ్చేయి. చెక్కులేని కీర్తికంటే చెక్కుతో వచ్చిన కీర్తి ఎంతో ఆనందదాయకమని అతను దాన్తో తెలుసుకున్నాడు. అతను పెట్టిన పేరు "స్త్రీ, దుర్భరం నీ జీవితం!"

ఆ కథానికా రచయిత ఇంబళ్ళూర్ తమ్మయ్య ఆ కథానికా రచనతో "రచ.ఇ.త."గా మారేడు, ప్రఖ్యాతి చెందేడు.

ఆ తరువాత ఓ చిన్న ప్రమాదం జరిగింది. అది రచ.ఇ.త.కి జరగలేదు. ఆ కథ చదివేక అది అందరూ చదివి తననే చూస్తున్నారని తెలుసుకున్నాక యువ రచ.ఇ.తైన ఇ.త. గారి పక్కింటివారి విధవ మేనత్త ఊరవతల చెరువులో పడింది, 'నిజం నిప్పులాంటిదయినప్పుడు ఆవిడ అలా చేస్తే మనవేం చేస్తాం?' అని ఇ.త. గారి ముదురు స్నేహితుడొకాయన అన్నాడు. ఇ.త. కూడా ఆమె చావు గురించి ఇదే మాట అన్నాడు.